హామీలు తప్ప.. అభివృద్ధేమీ లేదు



బొక్కొనిగూడలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



పోచారంలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

- మేడ్చల్ అంతా మల్లారెడ్డి చేసిన అభివృద్ధి శూన్యం
- కాంగ్రెస్ పార్టీ గెలిస్తేనే అభివృద్ధి, సంక్షేమం
- తోటకూర వజ్రేశ్‌యాదవ్‌ను గెలిపించాలని ప్రచారం

మేడ్చల్ జోన్ బృందం: మేడ్చల్ ఎమ్మెల్యేగా హామీలు తప్ప మంత్రి మల్లారెడ్డి చేసింది ఏమీ లేదని కాంగ్రెస్ ఘట్‌కేసర్ మున్సిపాలిటీ అధ్యక్షుడు మామిండ్ల ముత్యాలుయాదవ్, మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్ అన్నారు. మంగళవారం ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ మేడ్చల్ ఎమ్మెల్యే అభ్యర్థి తోటకూర వజ్రేశ్‌యాదవ్‌ను గెలిపించాలని ప్రచారం చేశారు. అలాగే మేడ్చల్, పోచంపల్లి, నాగారం, దమ్మాయిగూడ, పోచారం మున్సిపాలిటీ, జవహర్‌నగర్ కార్పొరేషన్, మేడ్చల్, మూడుచింతలపల్లి, శామీర్‌పేట్, కీసర, ఘట్‌కేసర్ మండలంలో స్థానిక నాయకులు ర్యాలీ నిర్వహించారు. పోచారంలో వెంకట మాధవరెడ్డి, మెట్టు నర్సింహరెడ్డి, ఘట్‌కేసర్ మున్సిపాలిటి బొక్కొనిగూడలో మాజీ సర్పంచ్ వెంకటేశ్ ముదిరాజ్, ఎఫ్ఎస్‌సీఎస్ మాజీ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి అనిత, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఉల్లి ఆంజనేయులుయాదవ్ జోరుగా ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆరు హామీలు, గతంలో కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధి గురించి ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. చేయి గుర్తుకు ఓటేసి కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేశ్‌యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.



వజ్రేశ్‌యాదవ్‌ను గెలిపించాలని ఘట్‌కేసర్‌లో కాంగ్రెస్ నాయకుల ప్రచారం



ప్రతాపసింగారంలో డ్యాన్స్ చేస్తున్న మంత్రి మల్లారెడ్డి



జవహర్‌నగర్‌లో రోడ్ షోలో మంత్రి మల్లారెడ్డి

మరోమారు గెలిపిస్తే.. మరింత అభివృద్ధి చేస్తా

మేడ్చల్ బీఆర్ఎస్ అభ్యర్థి చామకూర మల్లారెడ్డి

మేడ్చల్ జోన్ బృందం: ఎందరో ఎమ్మెల్యేలు మారినా మేడ్చల్ నియోజకవర్గం అభివృద్ధి చెందలేదని, తన హయాంలోనే అభివృద్ధి జరిగిందని మేడ్చల్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మంగళవారం ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, మండలంలోని ప్రతాపసింగారం, చౌదరిగూడ ఎన్నికల ప్రచారం, బైక్ ర్యాలీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడ్చల్ నియోజవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశానని, గత ఎమ్మెల్యేలు చేసిన అభివృద్ధి ఏంటో తాను ఎమ్మెల్యేగా చేసిన అభివృద్ధి ప్రజలకు తెలుసన్నారు. గత ఎన్నికల్లో తనను గెలిపించినందుకు నియోజకవర్గాన్ని అద్దంలా మార్చానని, మరోమారు గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసి రాష్ట్రంలో ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. ఘట్‌కేసర్ రైల్వే వంతెన పనులు, ప్రతాపసింగారంలో యూత్ భవనం పనులు



ఘట్‌కేసర్ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి

పూర్తి చేయిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో సొంత డబ్బుతో యూత్ భవనాలు, ఆలయాలు, సీసీ రోడ్లు నిర్మించానన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందాయన్నారు. ఐదేళ్ల క్రితం ఓటేసినందుకు రూ.కోట్లు వెచ్చించి పనులు చేశానని, మరో ఐదేళ్లు సేవచేసే అవకాశం కల్పించాలని కోరారు. మున్సిపల్ చైర్మపర్సన్ పావనీజంగయ్య, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షులు రమేశ్ పాల్గొన్నారు.

రోడ్ షోలు.. బైక్ ర్యాలీలు..

మల్లారెడ్డి పెద్ద ఎత్తున రోడ్‌షోలు, బైక్ ర్యాలీల్లో పాల్గొని ప్రచారం నిర్వహించారు. ఘట్‌కేసర్ మండలంలోని చౌదరిగూడ, జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరిగిన రోడ్‌షో, బైక్ ర్యాలీలో పాల్గొని ఓటర్లను ప్రసన్నం చేసుకున్నారు.



జవహర్‌నగర్‌లో బైక్ ర్యాలీలో మంత్రి మల్లారెడ్డి



మేడ్చల్‌లో పార్టీ మండల అధ్యక్షుడు దయానంద్ యాదవ్ తదితరులు



జోరుగా బీఆర్ఎస్ ప్రచారం

మేడిపల్లి అనురాధ రెసిడెన్సీ బ్లాక్-సిలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ హరిశంకర్‌రెడ్డి

సమస్యలపై సర్వసభ్య సమావేశం

కీసర: మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం కీసరలో మంగళవారం జరిగింది. ఎంపీపీ మల్లారపు ఇందిర ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పలు సమస్యలు, అభివృద్ధి పనులపై సభ్యులు చర్చించారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు జే.సత్తిరెడ్డి, ఎంపీటీసీలు నారాయణ శర్మ, కవిత, కిరణ్ జ్యోతి, భసారత్ అలీ, కో ఆప్షన్ ఎంపీటీసీ, ఎంపీడీఓ గ్యామ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ ఇందిర

ఓటుపై అవగాహన ర్యాలీ



ఘట్‌కేసర్: ఓటు వినియోగంపై కొండాపూర్ విజ్ఞాన్ ప్రబోదనంద ప్రశాంతి నికేతన్ స్కూల్ విద్యార్థులు ఘట్‌కేసర్ మున్సిపాలిటీ కొండాపూర్‌లో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రజలు ఓటును అమ్ముకోవద్దని, నమ్ముకోవాలని, ఒక్క ఓటు మీ జీవితాలను తారుమారు చేస్తుందని, నోటుకు ఓటును అమ్ముకుంటే ఐదేళ్లపాటు వెన్నుపోటు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఐ.శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ఓటును నిర్లక్ష్యం చేయకుండా ఈ నెల 30న జరుగనున్న ఎన్నికల్లో ఓటేసి మంచి నాయకుడిని, ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జోరుగా బీజేపీ ప్రచారం



ప్రచారం చేస్తున్న నాయకులు

మేడ్చల్: పట్టణ పరిధిలోని నాల్గో వార్డు కిష్టాపూర్‌లో బీజేపీ నాయకులు మంగళవారం జోరుగా ప్రచారం నిర్వహించారు. బీజేపీ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని నాయకుడు అభిలాష్‌రెడ్డి నేతృత్వంలో ఇంటింటి ప్రచారం, ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేసి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అభిలాష్‌రెడ్డి, అర్జున్, రాంచంద్రారెడ్డి, రాజు, సందీప్, విక్రం, సాయి బాబు తదితరులు పాల్గొన్నారు.



వృద్ధుడికి అవగాహన కల్పిస్తున్న బీజేపీ నాయకులు

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి



ఉప్పల్, మల్కాజిగిరిల్లో డీఆర్సీ కేంద్రాలను పరిశీలించిన గౌతమ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని, బూత్ లెవల్ అధికారుల సమన్వయంతో ర్యాంప్, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, ఫర్నీచర్, టాయిలెట్లు తప్పనిసరిగా ఉండేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఉప్పల్, రామంతాపూర్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వం పాలిటెక్నిక్ కాలేజీ, సైనిక్‌పురి భవన్స్, వివేకానంద కాలేజీల్లోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లతో పాటు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారులు అభిషేక్ అగస్త్య, రవి కిరణ్‌తోపాటు ఏఈఆర్ఓలు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారులు పోరాట పటిమ కలిగి ఉండాలి



వాలీబాల్ క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ శ్రీనివాస్, పీడీ శ్రీనివాస్‌రెడ్డి

ఘట్‌కేసర్: క్రీడాకారులు పోరాట పటిమ కలిగి ఉండాలని విజ్ఞాన భారతి ఇంజినీరింగ్ కళాశాల(వీబీఐటీ) ప్రిన్సిపల్ పీవీఎస్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం వీబీఐటీ క్యాంపస్‌లో ఆ కళాశాల బాలికల వాలీబాల్ క్రీడాకారులను అభినందించారు. హకీంపేట్‌లోని స్పోర్ట్స్ స్కూల్‌లో ఈనెల 26, 27 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నీలో వీబీఐటీ బాలికల జట్టు రన్నర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ బాలురుతో సమానంగా బాలికలు రాణించాలన్నారు. అనంతరం స్పోర్ట్స్ కిట్స్, నగదు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో వీబీఐటీ ఎంబీఏ హెచ్ఓడీ పద్మజ, పీడీ శ్రీనివాస్‌రెడ్డి, శివలాల్, మహేశ్వ, వెంకటేశ్, క్రీడాకారులు శ్రావ్య, షణ్ముఖీ, సంధ్య, మాధురి, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



బోడుప్పల్: సమాజంలో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జేజీఆర్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ గంగరాజు అన్నారు. అందరం ఓటేద్దాం.. మా తల్లిదండ్రుల చేత ఓటు వేయిస్తాం అనే నినాదంతో మంగళవారం జేజీఆర్ స్కూల్ విద్యార్థులు నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా సమాజ హితం కోరే వ్యక్తులకు ఓటేసి ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రులచే ఓటు వేయిస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు. ర్యాలీలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా అంతటా 48 గంటలు 144 సెక్షన్ అమలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: ఎన్నికల విధులను సమన్వయంతో బాధ్యతాయుతంగా నిర్వహించాలని, ఈ విషయంలో ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తప్పవని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, నోడల్ అధికారులతో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి ఈ నెల 30న పోలింగ్ పూర్తి అయ్యే వరకు 48 గంటల పాటు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

- 144 సెక్షన్ అమలులో భాగంగా ఎలాంటి సభలు, సమావేశాలు నిర్వహించరాదని, గుంపులు గుంపులుగా ప్రజలు ఉండకూడదన్నారు.
- ఐదు గురు వ్యక్తులకంటే మించి ఉండరాదని, డోర్ టు డోర్ ప్రచారం చేయరాదని పేర్కొన్నారు. ఎన్నికల రోజున సిబ్బంది సకాలంలో పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలన్నారు.
- మాక్ పోల్ ఉదయం 5.30 గంటలకు నిర్వహించాలన్నారు. పోలింగ్ సజావుగా జరిగే విధంగా విధులు నిర్వహించాలన్నారు.
- పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేసి పోలింగ్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. పోలింగ్ పూర్తయిన తర్వాత కేంద్రాల నుంచి కౌంటింగ్ కేంద్రాల్లోని స్ట్రాంగ్ రూమ్‌కు ఈవీఎంలను తరలింపునకు అవసరమైన వాహనాలను సిద్ధం చేయాలన్నారు.
- ఎన్నికల రోజున ప్రతీ 2 గంటలకు పోలింగ్ శాతంపై ఎన్నికల అధికారులకు సమాచారం అందించాలన్నారు. పోలింగ్ ప్రక్రియపై ఎప్పటికప్పుడు ఎన్నికల అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు.

పూర్తయిన మూడో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాకు సంబంధించి ఎన్నికల నిబంధనల ప్రకారం మూడో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ నిర్వహించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎస్.కె.జైన్, పూర్వాగార్గ్, అమన్ మిట్టల్ ఆధ్వర్యంలో ఎన్నికల సిబ్బందికి సంబంధించి ర్యాండమైజేషన్ ప్రక్రియను చేపట్టారు. మేడ్చల్‌కు 584, మల్కాజిగిరికి 429, కుత్బుల్లాపూర్‌కు 590, కూకట్‌పల్లికి 418, ఉప్పల్‌కు 418 బృందాలను ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఒక ప్రిసైడింగ్ ఆఫీసర్, ఒక అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్, ఇద్దరు పోలింగ్ ఆఫీసర్లు ఉంటారని ఆయన తెలిపారు. రిజర్వ్ టీమ్‌లకు శిక్షణ ఇచ్చి, హోమ్ ఓటింగ్‌కు ఉపయోగించామన్నారు. జిల్లాకు సంబంధించి మైక్రో అబ్జర్వర్ల ర్యాండమైజేషన్ ప్రక్రియను చేపట్టి, అవసరమైన 200 మంది మైక్రో అబ్జర్వర్ల ఎంపిక పూర్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులతోపాటు ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి అసెంబ్లీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- యువత తొలి ఓటు అనుభూతి పొందాలి
- వంద శాతం పోలింగ్ నమోదుకు నడుంబిగించాలి
- ఓటు వేసేందుకు గుర్తింపు కార్డు తప్పనిసరి
- జిల్లా ఎన్నికల అధికారి పి.గౌతమ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: ఈ నెల 30న జరిగే పోలింగ్‌లో యువత పాల్గొని తొలి ఓటు అనుభూతి పొందాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ పి.గౌతమ్ అన్నారు. ప్రజాస్వామ్య దేశంలో యువతకు ఎక్కువ ప్రాధాన్యం ఉందని, రాజకీయ నిర్ణయాధికారం కూడా యువతదేనని పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ చైతన్యవంతులైన ఓటర్లు తమ ఓటును వినియోగించుకుని, వంద శాతం పోలింగ్ నమోదయ్యేలా నడుంబిగించాలన్నారు.

ఓటు వేసేందుకు ఒక కార్డు తప్పని సరి..

ఓటు హక్కు వినియోగించుకొనేందుకు ఫొటోతో ఉన్న ఓటరు కార్డు లేదా ఎన్నికల సంఘం నిర్దేశించిన గుర్తింపు కార్డులో ఏదైనా ఒక కార్డును పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లాలని ఆయన తెలిపారు. ఓటర్ ఎపిక్ కార్డు, ఆధార్ కార్డు, ఉపాధి హామీ పథకం కార్డ్, బ్యాంక్/పోస్టాఫీస్(ఫొటోతో ఉన్నవి). పాస్‌బుక్, ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, జాతీయ జనాభా రిజిస్టరు జారీ చేసిన స్మార్ట్ కార్డ్, పాస్‌పోర్ట్, ఫొటోతో ఉన్న పింఛన్ పత్రం, ఉద్యోగులకు కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వం/ప్రభుత్వ సంస్థలు/పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు జారీ చేసిన ఫొటో గుర్తింపు కార్డు, దివ్యాంగుల గుర్తింపు కార్డు, చట్ట సభలలో సభ్యత్వాన్ని చూపే అధికారిక గుర్తింపు కార్డుల్లో ఏదో ఒక గుర్తింపు కార్డుతో పోలింగ్ స్టేషన్‌కు తీసుకెళ్లి ఓటు వేయాలన్నారు.

మేడ్చల్‌లో మొత్తం ఓటర్లు 28.19 లక్షలు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని మొత్తం ఓటర్లు 28,19,067 మంది ఉండగా, ఇందులో పురుషులు 14,59,629, స్త్రీలు 13,59,057, థర్డ్ జెండర్ 381 మంది ఉన్నారని జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 841 లొకేషన్లలో 2439 పోలింగ్ స్టేషన్లు ఉండగా, వీటిలో అర్బన్ పోలింగ్ స్టేషన్లు 2280, రూరల్ పోలీస్ స్టేషన్లు 159 ఉన్నాయన్నారు. అన్నీ పోలింగ్ స్టేషన్లలో వెబ్ క్యాస్టింగ్ ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో ఐదు నియోజకవర్గాలకు రిటర్నింగ్ ఆఫీసర్స్‌తో సహా 16 విభాగాలకు నోడల్ అధికారులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. 5 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 126 మంది అభ్యర్థులు ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని తెలిపారు.

మహిళలకు 25 ప్రత్యేక పోలింగ్ స్టేషన్లు..

జిల్లాలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఐదు మహిళా పోలింగ్ స్టేషన్ల చొప్పున ఐదు నియోజకవర్గాలలో 25 మహిళా పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని తెలిపారు. ఈ పోలింగ్ స్టేషన్లలో పూర్తిగా మహిళా అధికారులు, సిబ్బంది ఎన్నికల విధులు నిర్వహిస్తారని తెలిపారు. అలాగే ప్రతి నియోజకవర్గంలో దివ్యాంగులకు ఒకటి చొప్పున ఐదు నియోజకవర్గాలకు ఐదు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఇందులో కూడా పూర్తిగా దివ్యాంగులు ఎన్నికల విధులను నిర్వహిస్తారన్నారు. బ్రెయిలీ లిపిలో ఉన్న నమూనా బ్యాలెట్‌తో అంధులకు ఓటు హక్కు కల్పించడం జరిగిందన్నారు. వృద్ధుల కోసం వీల్ చైర్స్ ఏర్పాటు చేసామన్నారు.

ఎన్నికలకు 12,510 మంది పోలింగ్ సిబ్బంది..

జిల్లాలో 2439 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 12,510 మంది పోలింగ్ సిబ్బందిని నియమించగా, ఇందులో 2,880 మంది పీవోలు, 2,880 మంది ఏపీవోలు, 6,570 మంది ఓపీవోలు ఉన్నారని తెలిపారు. మైక్రో అబ్జర్వర్లు 200 మంది ఎన్నికల విధులను నిర్వహిస్తున్నారన్నారు.

హోం ఓటింగ్‌లో 1,007 మంది

జిల్లాలో హోం ఓటింగ్ ద్వారా 1,007 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. ఇందులో 80 సంవత్సరాల పైబడిన వారు 668 మంది ఉండగా, దివ్యాంగులు 339 మంది ఉన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌లో 6,368 మంది

ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సిబ్బందిలో 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 3,154 పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోగా, ప్రస్తుత ఎన్నికల్లో 6,368 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగిచుకున్నారని ఆయన తెలిపారు.

నర్సింహారెడ్డి కళాశాలలో హ్యాకథాన్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి కళాశాలలో హ్యాకథాన్ నిర్వహించారు. కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం, వాల్యూ లాడెన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని కళాశాల కార్యదర్శి త్రిశూల్‌రెడ్డి, వాల్యూ లాడెన్ సంస్థ అధ్యక్షులు మాట్లాడుతూ విద్యార్థులు నేటి సమాజంలో నెలకొన్న సమస్యలకు సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కారాలను చూపాలన్నారు. సమస్యల పరిష్కారం అందించడానికి, నూతన ఆవిష్కరణలకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయన్నారు. హ్యాకథాన్‌లో పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొనగా ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, ప్రిన్సిపాల్ లోకనాథం, సుజీత్, రామసుబ్బారెడ్డి, సునీల్, కవిత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



హ్యాకథాన్‌లో విద్యార్థులు, అధ్యాపకులు

ఆరు గ్యారంటీలతో గెలుపు ఖాయం



బోడుప్పల్: కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టనున్న ఆరు గ్యారంటీలతో ఆ పార్టీ గెలుపు ఖాయమని మేడ్చల్ నియోజకవర్గ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్ మాజీ ఎంపీటీసీ సభ్యురాలు, బీఆర్ఎస్ నాయకురాలు బొమ్మక్ జయమ్మ, వారి కుమారుడు బొమ్మక్ సాయికిరణ్ మంగళవారం వజ్రేష్‌యాదవ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి, కార్పొరేటర్ బొమ్మక్ కళ్యాణ్‌కుమార్, మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, మాజీ వార్డు సభ్యులు తోటకూర రవీందర్‌యాదవ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



బోడుప్పల్: కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు మేడ్చల్ నియోజకవర్గ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని 23వ డివిజన్ కార్పొరేటర్ రాసాల వెంకటేశ్‌యాదవ్, సీనియర్ నాయకులు రాపోలు రాములు అన్నారు. బోడుప్పల్ ఇందిరానగర్ చౌరస్తాలో మంగళవారం నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టనున్న ఆరు గ్యారంటీలకు ప్రజల్లో మంచి స్పందన లభిస్తోందన్నారు. ఈ నెల 30వ తేదీన జరగనున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటేసి వజ్రేష్‌యాదవ్ గెలుపు కోసం కృషి చేయాలని వారు ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో సీపీఐ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్, కో ఆప్షన్ సభ్యురాలు బద్దుల సుగుణ సత్యనారాయణ, నాయకులు తూర్పాటి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.